క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లి ఉత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెంలో ఆదివారం గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి, పోతురాజు ఆలయ ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, బలిహరణ జరిగాయి. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు.

8న కొమ్మూరు ఉప సర్పంచ్ ఎన్నిక

కాకుమాను: మండలంలోని కొమ్మూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక 8న నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ నాగానంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన పక్షంలో మరుసటి రోజు నిర్వహించి, ఫలితాన్ని కూడా ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

హైజంప్ పోటీల్లో రేటూరు యువకుడి ప్రతిభ



కాకుమాను: జాతీయ స్థాయిలో నిర్వహించిన హైజంప్ పోటీల్లో మండలంలోని రేటూరుకు చెందిన షేక్ మెహిద్దీన్(24) అత్యంత ప్రతిభ చూపాడు. ఏప్రిల్ 25 నుంచి ఈనెల మూడో తేదీ వరకు లక్నోలో జరిగిన పోటీల్లో పాల్గొని మూడో స్థానాన్ని పొందాడు. చిన్ననాటి నుంచి హైజంప్ అంటే ఇష్టపడే మెహిద్దీన్ మద్రాసుకు చెందిన గురువు దాము రతినం శిక్షణలో గతంలో అనేకసార్లు నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. ఈ సందర్భంగా మెహిద్దీన్ మాట్లాడుతూ నేషనల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పెదకాకాని: శివాలయానికి వచ్చిన యువకుడి అదృశ్యంపై కేసు నమోదైంది. స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మొక్కులు చెల్లించుకునేందుకు పల్నాడు జిల్లా ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామానికి చెందిన సింగంశెట్టి హనుమంతరావు కుటుంబ సభ్యులతో వచ్చారు. మానసికస్థితి సరిగా లేని 19 సంవత్సరాలు కుమారుడు అజయ్ మధ్యాహ్నం కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. కుమారుడు అదృశ్యంపై సింగంశెట్టి హనుమంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

పోటీలో రాణించేందుకు ఆంగ్ల భాషా నైపుణ్యం కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో రాణించేందుకు ఆంగ్ల భాషా నైపుణ్యాలు ఎంతో కీలకమని డాక్టర్ బ్రహ్మనాయుడు తెలిపారు. బ్రాడీపేటలోని ఎంఎస్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ సెంటర్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కె. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో నైపుణ్యాలు ఉంటేనే జీవితంలో విజయం సాధించగలరని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాభినయం



పాత గుంటూరు: ఆర్. అగ్రహారం శివాలయం ప్రాంగణంలో రుద్ర కళాక్షేత్రం నాట్యాచార్య మాచిరాజు రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం గజ్జె పూజ సందర్భంగా విద్యార్థినుల కూచిపూడి నృత్యం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆలయ ఈవో పగడాల శివకోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నటరాజ స్వామి పూజ నిర్వహించారు. విద్యార్థినులు యద్దనపూడి విద్యాసాయి అమృత, కొల్లా కమలాదేవి, పసుపులేటి జాహ్నవి, ఆలపాటి అమృత సాయి, దంపూరి కేధన, కొల్లా వీణావాసవీలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.

ఫొటోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ త్రైమాసిక ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్టు అకాడమీ ప్రధాన కార్యదర్శి కానాల సుధాకర రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఫెస్టివల్స్' అంశంపై కలర్, మోనోక్రోమ్ విభాగాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, అయిదుగురికి మెరిట్ సర్టిఫికెట్లను అకాడమీ వార్షికోత్సవ సభలో ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదనీ, ఒక్కొక్కరు రెండు విభాగాల్లో నాలుగు ఎంట్రీలను పంపుకోవచ్చని వివరించారు. ఎంట్రీలను ఈ నెల 11లోగా పంపాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పౌర్ణమి పూజలు



వెనిగండ్లలో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



శలపాడులో బొడ్డురాయి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు

పెదకాకాని: ఏరువాక పౌర్ణమి పూజల్ని మండలంలోని వెనిగండ్లలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా జూన్‌లో రైతులు ఎడ్లు, ప్రభలతో ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఈ ఏడాది కూడా రైతులు, పిల్లాపాపలతో ఆదివారం సాయంత్రం వినాయకుని గుడి వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు వృద్ధి చెందాలని మొక్కులు మొక్కారు. విఘ్నేశ్వరుడికి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, ఉండ్రాళ్ళు, పాయసం సమర్పించారు. అర్చకులు వాసు అన్నదాతల పేరిట గోత్రనామ పూజలు చేశారు.

చేబ్రోలులో...

మండలంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నారాకోడూరు, శలపాడు, గొడవర్రు, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో రైతులు ఎడ్లల్ని అలంకరించి వ్యవసాయ పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని ఏరువాక పున్నమిగా పిలుస్తారు. ఏరు అంటే నాగలి, వాక అంటే దుక్కి దున్నడం. ఏరువాక పౌర్ణమి నుంచి పొలాలు దుక్కి దున్ని పనులు ప్రారంభిస్తారు. ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయం పండుగగా మారాలని ఆకాంక్షిస్తూ శలపాడు, కొత్తరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో గ్రామస్తులు సీతాలమ్మ తల్లికి అభిషేకాలు చేశారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్రకుమార్, శ్రీనివాసచార్యులు నిర్వహణలో సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, బాజాభజంత్రీలతో నగర వీధుల్లో స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు విశాలక్ష్మి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు



పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాత గుంటూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో ఆదివారం శ్లోక హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ విజయగౌరి ఆధ్వర్యంలో చిన్నారులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్రం కార్యదర్శి ఎన్. వెంకట గురుదత్తు, ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు నీలిమ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే దిశగా పోటీల్ని నిర్వహిస్తున్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తెలిపారు.

పారా మెడికల్ సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించాలి



సమావేశానికి హాజరైన రేడియోగ్రాఫర్లు

గుంటూరు మెడికల్: రేడియాలజీ వైద్య విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ రేడియాలజికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. రవీంద్రబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ప్రథమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు మాదిరిగానే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 30 రోజుల రేడియేషన్ సెలవులు ఇవ్వాలని కోరారు. డార్క్ రూమ్ అసిస్టెంట్లను జూనియర్ రేడియోగ్రాఫర్స్‌గా మార్పు చేయాలని, సింగిల్ రేడియోగ్రాఫర్ ఉన్న సీహెచ్‌సీల్లో జూనియర్ రేడియోగ్రాఫర్‌ను నియమించాలని కోరారు. ప్రభుత్వం పెద్దమనస్సు చేసుకుని కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని అభ్యర్థించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. జీవన్ మనోజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె. సత్యసుందరమూర్తి, రాష్ట్ర సెక్రటరీ బి. మణిబాబు, కోశాధికారి ఎల్.వి.బి.చారి, జిల్లా అధ్యక్షుడు వై. వరుణ్‌ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. దేవకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.ఎస్. సుధాకర్, సెక్రటరీ ఎం. అనిల్‌కుమార్, కోశాధికారి కె. రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు



సమావేశంలో సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

పాత గుంటూరు: పేద, మధ్య తరగతి కిడ్నీ బాధిత రోగులకు అధునాతన డయాలసిస్ సేవలు అందించడమే లక్ష్యంగా రోటరీ, రెడ్ క్రాస్ సంయుక్తంగా సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌లో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ గవర్నర్ తెల రాజశేఖరరెడ్డి తెలిపారు. ఆదివారం హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, పరిసర జిల్లాల కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ సెంటర్‌లో అందిస్తున్న సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో అధునాతన కిడ్నీ డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు కాలేషావలి, కె.వి భాస్కరరావు, లక్ష్మీనారాయణ, అరుణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

బాలబాలికలకు లలిత కళలపై ఆసక్తిని పెంచాలి



శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

పాత గుంటూరు: బాలబాలికలకు లలిత కళలపై ఆసక్తిని పెంచాలని రామనామ సంకీర్తన సంఘం ట్రస్టీ రాగం వెంకట లీలాసుందరి తెలిపారు. సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రం ప్రాంగణంలో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారి ఆధ్వర్యంలో బాలబాలికలకు లలిత కళల పరిచయంపై నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట లీలాసుందరి మాట్లాడుతూ చిన్నారుల్లో కళలపై ఆసక్తి కలిగే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శన, గానం, గీత పఠనం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించి సభికుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. గురువులు బసవరాజు జయశంకర్, బి.అనితరావును ఘనంగా సత్కరించారు. శ్రీ సత్యసాయి ఐడియల్ స్కూలు యాజమాన్యం చిన్నారులు, భక్తులకు ప్రసాద వితరణ చేసింది. కార్యక్రమంలో బండి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఒడిస్సాలో జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మృతి చెందిన అభాగ్యుల కుటుంబాలకు అవర్ స్టేట్ అవర్ లీడర్ సోషల్ మీడియా గ్రూప్, వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి, సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు. రైలు ప్రమాదంలో వందలాది మంది అమాయక ప్రయాణికులు ప్రాణాల్ని కోల్పోవడం అత్యంత బాధాకరమని, వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని కోరారు.

మదర్సాలో హజ్ యాత్రికులకు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తదితరులు

పెదకాకాని: నంబూరు సిరాజుల్ ఉలూం మదర్సాలో హజ్ యాత్రికుల బస కేంద్రాన్ని ఆదివారం డెప్యూటీ సీఎం అంజద్ బాషా పరిశీలించారు. హజ్ యాత్రికులను కలిసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 6న శిబిరాన్ని సందర్శించనున్న దృష్ట్యా అధికారులందరూ సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మదర్సాలో తాగునీటి సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరిష్కరించారు.

● స్నేహమేరా జీవితం.. శాశ్వతం



పాఠశాల స్నేహితులంతా ఒక్కచోట చేరారు.. ఆ సంతోషం.. ఉద్వేగం.. ఇక చెప్ప తరమా.. కళ్లు మెరిశాయి.. ఒకరి నొకరూ అప్యాయంగా పలకరించుకున్నారు.. అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. 28 సంవత్సరాల తర్వాత 1994-1995 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల కలయితో గొరిజవోలుగుంటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పులకించి పోయింది. పండుగ వాతావరణాన్ని తలపించింది. తమ అభ్యున్నతికి మార్గం చూపిన పాఠశాల ఉపాధ్యాయుల్ని ఘనంగా సన్మానించారు. – పెదనందిపాడు

విధులకు శానిటేషన్ సెక్రటరీల గైర్హాజర్

నెహ్రూనగర్: రాష్ట్రవ్యాప్తంగా శానిటేషన్ సెక్రటరీల యూనియన్ పిలుపు మేరకు గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు విధులకు గైర్హాజరు అవుతున్నారు. నగరంలో పారిశుద్ధ్య పర్యవేక్షణ బాధ్యత చూసుకోవాల్సిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో పాటుగా శానిటేషన్ కార్యదర్శులపై ఉంది. జాబ్ చార్ట్ ప్రకారం ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటలకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, దీనికి విరుద్ధంగా 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల విధులకు హాజరవుతామని చెప్పుకుంటూ వారికి కేటాయించిన జాబ్ చార్ట్ విధులకు జూన్ 1వ తేదీ నుంచి గైర్హాజరవుతున్నారు. విషయాన్ని గుంటూరు నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కువ్వారపు మనోహర్‌బాబు లేఖ రూపంలో ఎంహెచ్‌ఓ(మున్సిపల్ హెల్త్ ఆఫీసర్)ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్‌కు అందజేశారు.

అలరించిన సంగీత విభావరి



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, రంగారావు తదితరులు

పాత గుంటూరు: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పాత్తూరి రంగారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళారంగ ప్రముఖులు చిమట శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, డాక్టర్ యలమంచలి జగదీష్ బాబు, రసూల్ బాబు, శైలజలకు ఎస్పీ బాలు జీవిత సాఫల్యం పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బాలు గానం అజరామరం

మేయర్ కావటి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: ఎంతోమంది ప్రజల అభిమానం పొందిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. బాలసుబ్రహ్మణ్యం జయంతి ఆదివారం సందర్భంగా నాజ్ సెంటర్ సర్కిల్‌లో ఆయన విగ్రహం వద్ద కళాదర్బార్, ది తాగూరు మెమోరియల్ థియేటర్ ట్రస్టు ఆధ్వరంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. బాలు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగువాడిగా పుట్టటం మన అదృష్టంగా భావించాలని తెలిపారు. ఆయన గాన మాధుర్యంతో ఎంతో మంది ప్రజల అభిమానాన్ని పొందారని, ఆయన్ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని చెప్పారు. ఏ భాషలో పాట పాడినా ఆ భాషకు చెందిన వ్యక్తిగా పాడేవారని పేర్కొన్నారు. తెలుగు ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన బాల సుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేసినందుకు కళాదర్బార్ అధ్యక్షులు పాత్తూరు రంగారావు అభినందనీయులని తెలిపారు. కార్యక్రమంలో కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, తాగూరు మెమోరియల్ థియేటర్ ట్రస్టు సభ్యులు, గాయని, గాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం 8.30 గంటలకే స్పందన రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు సచివాలయాల్లోనూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై అక్కడ కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని ఆమె సూచించారు.

మంగళగిరి టికెట్ బీసీలకు కేటాయించాలి

బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజు

తాడేపల్లిరూరల్: మంగళగిరి అసెంబ్లీ టికెట్ అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే కేటాయించాలని రాష్ట్ర బీసీ సేన అధ్యక్షుడు సొంటి నాగరాజు అన్నారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న బీసీ సేన రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి బీసీ ప్రాతినిధ్యం తగ్గిందని అన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేసినా ఎన్నికలు నిర్వహించకుండా కుటిల రాజకీయం చేశారని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులను నిలబెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నియోజవర్గంలో బీసీలను ఏకం చేసి రాజకీయపార్టీల వ్యూహాలను తిప్పి కొడతామని అన్నారు. మంగళగిరి కార్పొరేషన్ చేయడం వల్ల పేద, మధ్యతరగతి వారిపై పన్నుల భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ పరస రంగనాథ్, పట్టణ యువజన అధ్యక్షుడు ప్రసాద్, తాడేపల్లి పట్టణ యువజన అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ

తెనాలి: పట్టణ నెహ్రూరోడ్డులోని గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు. అత్తోట జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావు సైన్స్ ప్రయోగాలు, విష్ణుమొలకల భీమేశ్వరరావు తెలుగు పద్యాలు, గేయాలలు, ఆళ్ల నాగేశ్వరరావు ఏరువాక పౌర్ణమి విశిష్టతను తెలియజెప్పారు.

అలరించిన పూజీ అరంగేట్రం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళా వేదికపై రాధా మాధవ కల్చరల్ అసోసియేషన్, రాధా మాధవ నాట్యక్షేత్రం నాట్యాచార్య షేక్ ఖలీల్ ఆధ్వర్యంలో ఆదివారం నెలనెలా వెన్నెల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్యక్షేత్రం విద్యార్థిని పూజీ ఆరంగేట్రంలో పలు నృత్యాంశాలు ప్రదర్శించి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో మిట్టపల్లి రమేష్‌బాబు, డాక్టర్ తాళ్లపాక సందీప్‌కుమార్, నాగసాయి పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి దివ్య కల్యాణం



పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం 21వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం విశేష పూజలు, హోమాలు, చండీయాగం, సువాసినీ పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి దివ్య కల్యాణమహోత్సవం కనులపండువగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వాహక వర్గం పర్యవేక్షించింది.